అర్జున్ నంబర్‌వన్

ఆనంద్‌ను దాటేస్తూ అగ్రస్థానానికి

ముంబై: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ సత్తాచాటాడు. ఇటీవల జరిగిన చెన్‌జెన్ చెస్ మాస్టర్స్, బుందుస్‌లిగా టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చడం ద్వారా తాజా ఫిడే ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. ఎనిమిది పాయింట్ల మెరుగుతో మొత్తం 2756 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. మాగ్నస్ కార్ల్‌సన్(2830), ఫాబియానో కరున(2803)వరుసగా టాప్-2లో ఉన్నారు. భారత ర్యాంకింగ్స్ పరంగా చూసుకుంటే విశ్వనాథన్ ఆనంద్(2751) రెండో ర్యాంక్‌ను నెడుతూ ఈ తెలంగాణ కుర్రాడు టాప్ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ప్రజ్ఞానంద(2747), గుకేశ్(2743), విదిత్ గుజరాతి(2727) ఆ తర్వాతి ర్యాంక్‌ల్లో ఉన్నారు.

మీరాకు పారిస్ బెర్తు

ఐడబ్ల్యూఎఫ్ వరల్డ్ కప్

పుకెట్: భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను..ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో థాయ్‌లాండ్‌లోని పుకెట్ వేదికగా జరుగుతున్న వరల్డ్ కప్‌లో మీరాబాయి చాను మూడో స్థానంలో నిలిచింది. సోమవారం ముగిసిన గ్రూప్-బీ మహిళల 49 కిలోల విభాగంలో పోటీపడ్డ ఆమె.. 184 కిలోల (81 స్నాచ్ + 103 క్లీన్ అండ్ జెర్క్) బరువు ఎత్తింది. మూడో స్థానంలో నిలవడంతో ఈ ఏడాది ఆగస్టులో జరుగబోయే పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె బెర్త్‌ను ఖాయం చేసుకుంది. విశ్వక్రీడలలో పాల్గొనాలంటే పుకెట్‌లో జరుగుతున్న ఈవెంట్ చివరిది కావడంతో ఆరు నెలల విరామం తర్వాత చాను వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగింది. ఐడబ్ల్యూఎఫ్ వరల్డ్ కప్ ముగిశాక టాప్-10లో ఉన్నవారికి ఒలింపిక్స్ బెర్త్ దక్కనుంది.

మియామి విన్నర్ సిన్నర్

ఫ్లోరిడా: మియామి ఓపెన్ టెన్నిస్ పురుషుల సింగిల్స్ విజేతగా ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్ నిలిచాడు. ఫ్లోరిడా వేదికగా ఆదివారం రాత్రి ముగిసిన ఫైనల్‌లో మూడో సీడ్ సిన్నర్.. 6-3, 6-1 తేడాతో బల్గేరియా ఆటగాడు, 11వ సీడ్ గ్రిగోర్ దిమిత్రోవ్‌ను చిత్తుచేశాడు. కార్లోస్ అల్కరజ్, డానియల్ మెద్వెదెవ్ వంటి స్టార్ ప్లేయర్లకు షాకిచ్చిన దిమిత్రోవ్.. ఫైనల్ పోరులో మాత్రం తేలిపోయాడు. గంటా 13 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వరుస సెట్లను గెలుచుకున్న సిన్నర్ మియామి ఓపెన్ గెలిచిన తొలి ఇటలీ ఆటగాడిగా రికార్డులకెక్కాడు. 2021, 2023లలో ఫైనల్ చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకున్న సిన్నర్.. మూడో ప్రయత్నంలో టైటిల్ నెగ్గడం విశేషం. ఈ ఏడాది ఆరంభ సీజన్ ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచిన సిన్నర్.. ఏటీపీ రోటర్‌డామ్‌లోనూ టైటిల్ కొట్టాడు. ఇండియానా వెల్స్‌లో అల్కరజ్ చేతిలో ఓడినా మియామి ఓపెన్‌లో విజేతగా నిలిచాడు.

రాయల్స్ హ్యాట్రిక్

రాజస్థాన్ గెలుపు జోరు • బౌల్ట్, చాహల్, పరాగ్ విజృంభణ • ముంబైకి వరుసగా మూడో ఓటమి

బౌల్ట్ (3/22)

ఐపీఎల్-17లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్‌లు హ్యాట్రిక్ కొట్టాయి. రాజస్థాన్ విజయాల్లో ఈ ఘనత సాధిస్తే ముంబై ఓటముల్లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఐపీఎల్‌లో మరే జట్టుకూ సాధ్యం కాని విధంగా 250వ మ్యాచ్‌ను ఆడిన ముంబై.. హోంగ్రౌండ్‌లో అవమానకర ఓటమిని మూటగట్టుకుంది. రాజస్థాన్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ పదునైన పేస్‌కు టాపార్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టగా.. బర్గర్, చాహల్‌లు ముంబై పనిపట్టారు. 14 మ్యాచ్‌లు ముగిసిన ఈ సీజన్‌లో ఆర్సీబీ తర్వాత ఆతిథ్య జట్టు ఓడటం ఇది రెండోసారి.

ముంబై: ఐపీఎల్-17లో నయా కెప్టెన్ హార్దిక్ పాండ్యా సారథ్యంలో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడింది. సొంత ఇలాఖా వాంఖడే స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం కారణంగా చిత్తుగా ఓడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులే చేయగలిగింది. ట్రెంట్ బౌల్ట్ (3/22) పేస్ పదునుకు తోడు యుజ్వేంద్ర చాహల్ (3/11) స్పిన్ మాయకు ముంబై కుదేలైంది. ఎంఐ సారథి హార్దిక్ (21 బంతుల్లో 34, 6 ఫోర్లు), తిలక్ వర్మ (29 బంతుల్లో 32, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్లు. ఛేదనలో రాజస్థాన్15.3 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. రియాన్ పరాగ్ (39 బంతుల్లో 54 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) ట్రెంట్ బౌల్ట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

బెంబేలెత్తించిన బౌల్ట్..

మ్యాచ్ ఆరంభమై ప్రేక్షకులింకా తమ సీట్లలో కూర్చోకముందే ముంబైకి బౌల్ట్ డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. వరుస బంతుల్లో రోహిత్ శర్మ, నమన్ ధీర్‌లను ఔట్ చేసి ప్రారంభంలోనే ఆ జట్టును దెబ్బతీశాడు. పవర్ ప్లేలో అత్యంత ప్రమాదకరమైన బౌలర్ అయిన బౌల్ట్ వేసిన ఐదో బంతి రోహిత్ బ్యాట్ ఎడ్జ్‌కు తాకగా శాంసన్ సూపర్ డైవింగ్ క్యాచ్ అందుకున్నాడు. మరుసటి బంతికే ధీర్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తన మరుసటి ఓవర్లో బౌల్ట్.. బ్రెవిస్‌ను ఔట్ చేసి ముంబైని కోలుకోనీయలేదు. రోహిత్, ధీర్, బ్రెవిస్‌లు సున్నాలు చుట్టడం గమనార్హం. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా 16 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ముంబైకి బర్గర్ మరో షాకిచ్చాడు. నాలుగో ఓవర్లో అతడు.. ఇషాన్ కిషన్ (16) ను పెవిలియన్‌కు పంపడంతో ఆ జట్టు కష్టాలు రెట్టింపయ్యాయి.

పరువు నిలబెట్టిన హార్దిక్ - తిలక్

3.3 ఓవర్లకు ముంబై 4 వికెట్లు కోల్పోయి 20 పరుగులు చేసిన ముంబైని కెప్టెన్ హార్దిక్, తిలక్ వర్మలు ఆదుకున్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 36 బంతుల్లోనే 56 పరుగులు జోడించారు. బర్గర్ వేసిన 6వ ఓవర్లో హార్దిక్ మూడు బౌండరీలు కొట్టగా... అవేశ్ ఖాన్ బౌలింగ్‌లో తిలక్‌వర్మ ఫైన్ లెగ్ దిశగా సిక్సర్ బాదడంతో ముంబై స్కోరు వేగం పుంజుకుంది. ఈ ఇద్దరూ కుదురుకుంటున్న దశలో చాహల్ తన స్పిన్ మాయాజాలంతో ముంబైని చుట్టేశాడు. పదో ఓవర్లో హార్దిక్‌ను ఔట్ చేసిన అతడు తర్వాత తిలక్ వర్మ, కొయెట్జీలనూ పెవిలియన్‌కు పంపాడు. పడుతూ లేస్తూ వచ్చిన ముంబైని వంద పరుగులు దాటించిన టిమ్ డేవిడ్ (17)ను బర్గర్ ఔట్ చేశాడు.

రాజస్థాన్ రాయల్‌గా..

ఛేదనలో రాజస్థాన్ ఆరంభంలో తడబడ్డా తర్వాత నిలకడగా ఆడింది. ఈ సీజన్‌లో తేలిపోతున్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (10), ముంబైపై మంచి రికార్డు ఉన్న జోస్ బట్లర్ (13), కెప్టెన్ సంజూ శాంసన్ (12)లు విఫలమయ్యారు. కానీ రియాన్ పరాగ్ తన ఫామ్‌ను కొనసాగిస్తూ ముంబై ఆశలపై నీళ్లు చల్లాడు. అశ్విన్ (16)తో కలిసి నాలుగో వికెట్ కు 40 పరుగులు జోడించిన పరాగ్.. శుభమ్ దూబేతో అజేయంగా 39 పరుగులు జతచేశాడు. ఈ సీజన్‌లో పరాగ్‌కు ఇది వరుసగా రెండో అర్ధసెంచరీ.

స్కోర్లు సంక్షిప్తం

ముంబై: 20 ఓవర్లలో 125/9 (హార్దిక్ 34, తిలక్ 32, చాహల్ 3/11, బౌల్ట్ 3/22)

రాజస్థాన్: 15.3 ఓవర్లలో 127/4 (పరాగ్ 54 నాటౌట్, అశ్విన్ 16, మధ్వాల్ 3/20, మఫక 1/23)

17 ఐపీఎల్‌లో డకౌట్ అవడం రోహిత్‌కు ఇది 17వ సారి. దినేశ్ కార్తీక్‌ను హిట్‌మ్యాన్ సమం చేశాడు.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	3	3	0	1.24	6
కోల్‌కతా	2	2	0	1.04	4
చెన్నై	3	2	1	0.97	4
గుజరాత్	3	2	1	-0.73	4
హైదరాబాద్	3	1	2	0.20	2
లక్నో	2	1	1	0.02	2
ఢిల్లీ	3	1	2	-0.01	2
పంజాబ్	3	1	2	-0.33	2
బెంగళూరు	3	1	2	-0.71	2
ముంబై	3	0	3	-1.42	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

రోహిత్ వికెట్‌కు ఫ్యాన్ బలి

కొల్హాపూర్: ఐపీఎల్‌లో క్రికెట్ ఫ్యాన్స్ పిచ్చి తారాస్థాయికి చేరింది. తమ అభిమాన ప్లేయర్లను ఎవరైనా దూషిస్తే తట్టుకోలేక చచ్చేటట్లు బాదే దూరం వెళ్లింది. వివరాల్లోకెళితే సరిగ్గా వారం క్రితం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్ రోహిత్‌శర్మ ఔట్..ఓ అభిమాని ప్రాణం తీసింది. హన్మంత్‌వాడి గ్రామంలో బందోపంత్ తిబ్లే (63), బల్వంత్‌తో పాటు సాగర్ ముగ్గురు కలిసి మ్యాచ్ చూశారు. అయితే రోహిత్ ఔటైనా తర్వాత తిబ్లే సంబురాలు చేసుకున్నాడు. దీంతో తమ అభిమాన క్రికెటర్ ఔటైనందుకు సంతోషపడుతావా అంటూ తిబ్లేపై బల్వంత్, సాగర్ దాడికి దిగారు. దీంతో గాయాల పాలైన తిబ్లే శనివారం తనువు చాలించాడు.

పంత్‌కు జరిమానా

విశాఖపట్నం: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు జరిమానా పడింది. ఆదివారం చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడినందుకు పంత్‌కు రూ.12 లక్షల ఫైన్ విధించారు. నిర్ణీత సమయంలో వేయాల్సిన ఓవర్ల కంటే తక్కువ వేసిన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐపీఎల్ ప్రకటనలో పేర్కొంది.

ఐపీఎల్ స్పెషల్

క్రికెట్‌లో ఫుట్‌బాల్ కోచ్!

తల మీద బ్యాక్ క్యాప్. ఒంటిమీద ఓ టీషర్ట్, 2/3 నిక్కరు. చేతిలో పెన్నూ పేపర్. పేరుకు హెడ్‌కోచ్ అయినా డగౌట్‌లో కనిపించిన దాఖలా ల్లేవు. నిత్యం బౌండరీ లైన్ చుట్టూ అటూ ఇటూ ప్రదిక్షణలు చేస్తూ ఓ చోట కుదురుగా ఉండని మనిషి. ఆకలైతే కొబ్బరి బొండంలో స్ట్రా వేసుకుని కూల్‌గా తాగుతూ కనిపించే ఆ వ్యక్తి.. మూడు సీజన్లుగా గుజరాత్ టైటాన్స్ తలరాతను రాస్తున్నాడు. 'క్రికెట్‌లో కోచ్ అంటే ఇలాగే ఉండాలి' అన్న ప్రాథమిక సూత్రాలను చించి డస్ట్ బిన్‌లో పారవేసి 'ఇలా ఉన్నా ఫలితాలు రాబట్టొచ్చు' అంటూ కోచింగ్‌కు కొత్త అర్థం చెబుతున్నాడు. కోచ్ అంటే సలహాలిచ్చి చేతులు దులుపుకోవడం కాదు.. ఆటగాళ్లతో కలిసిపోవడం అన్న ప్రాథమిక సూత్రాన్ని ఒంటబట్టించుకుని 'క్రికెట్‌లో ఫుట్‌బాల్ కోచ్' అంటూ ప్రశంసలు పొందుతున్నాడు. అతడెవరో కాదు. భారత మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా.

- 'ప్రొఫెషనల్ గేమ్'గా అభివర్ణించే క్రికెట్‌లో కోచ్‌లు వ్యవహరించే తీరూ ఆ పేరుకు తగ్గట్టే ఉంటుంది. డగౌట్‌లలో టీవీ స్క్రీన్‌ల ముందు కూర్చుని మ్యాచ్‌ను చూస్తూ, సహచర కోచింగ్ సిబ్బందితో ఏవేవో లెక్కలేసుకుంటూ అప్పుప్పుడూ ఆటగాళ్లకు నేరుగా లేదా ఇతర ఆటగాళ్ల ద్వారా సూచనలు, సలహాలు అందిస్తూ కనబడుతుంటారు. కానీ గుజరాత్ టైటాన్స్ హెడ్‌కోచ్ నెహ్రా మాత్రం ఈ పాతచింతకాయ పచ్చడి విధానాన్ని పక్కన పడేశాడు. క్రికెట్‌లో ఫుట్‌బాల్ తరహా కోచింగ్‌ను పరిచయం చేశాడు.
- ఫుట్‌బాల్‌లో మేనేజర్లుగా వ్యవహరించే కోచ్‌లు.. నిత్యం ఆటగాళ్లతో గ్రౌండ్ చుట్టూ పరుగులు పెడుతుంటారు. అప్పటికప్పుడే వ్యూహాలను సిద్ధం చేసుకుని ప్రత్యర్థి ఎత్తుల్ని చిత్తు చేస్తూ వాటిని పక్కాగా అమలుపరుస్తారు. ఆటగాళ్లతో పాటే పరుగులు పెడతారు. ప్లేయర్స్ రిప్లేస్‌మెంట్, ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేస్తూ అందుకు తగ్గట్టుగా వ్యూహాలు మార్చుకుంటారు. నెహ్రా కూడా ఇదే సూత్రాన్ని ఫాలో అవుతున్నాడు. ఓ రకంగా చెప్పాలంటే ప్రొఫెషనల్ క్రికెట్‌లో కోచ్‌లు ఏదైనా అవసరం వస్తే తమకు పెద్దగా పనిలేదనుకుని 'స్లీప్ మోడ్'లో ఉంటే నెహ్రా మాత్రం 'ఎనీ టైమ్.. యాక్టివ్ మోడ్' అన్నట్టుగా వ్యవహరిస్తాడు. నెహ్రా కోచింగ్ స్టైల్ చూసి అభిమానులు అతడిని ప్రీమియర్ లీగ్‌లో ప్రముఖ ఫుట్‌బాల్ జట్టు అయిన మాంచెస్టర్ సిటీ మేనేజర్ పెప్ గ్వార్డియోలతో పోలుస్తున్నారు.
- ఈ సీజన్‌లో గుజరాత్ కొత్త సారథి శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగిన విషయం తెలిసిందే. హార్దిక్ పాండ్యాతో రెండు సీజన్ల పాటు అద్భుతాలు రాబట్టిన నెహ్రా.. అంతగా అనుభవం లేని గిల్‌తోనూ అదే మ్యాజిక్‌ను పునరావృతం చేస్తున్నాడు. గుజరాత్ ఫీల్డింగ్ చేస్తున్నంతసేపూ బౌండరీ లైన్ చుట్టూనే ప్రదిక్షణలు చేస్తూ టీమ్‌కు 'షాడో కెప్టెన్'గా వ్యవహరిస్తున్నాడు. ప్రత్యర్థి బ్యాటర్లు పరుగులు రాబడుతుంటే వాళ్లకు అడ్డుకట్ట వేసేందుకు అప్పటికప్పుడే వ్యూహాలు రూపొందించి వాటిని బౌండరీ లైన్ వద్ద ఉన్న ఫీల్డర్ల ద్వారా గిల్‌కు చేరవేస్తున్నాడు. స్ట్రాటజిక్ టైమ్ అవుట్‌లోనూ ఇదే చర్చ. మ్యాచ్ జరుగుతున్న సమయంలో నెహ్రా ఖాళీగా ఉండటం చాలా అరుదు. ఎప్పుడూ తన పక్కనుండే ప్లేయర్లు, కోచ్‌లతో ఏదో ఒకటి సంభాషిస్తూనే ఉంటాడు. గుజరాత్ కోచింగ్ టీమ్‌లో గ్యారి కిర్‌స్టెన్, విక్రమ్ సోలంకి, మిథున్ మన్హాస్, ఆశిన్ కపూర్, నరేందర్ నేగి వంటి వాళ్లు ఉన్నా వాళ్లు కనబడిన దాఖలాలు తక్కువ.

గుజరాత్ కోచ్‌గా నెహ్రా రికార్డు..

16 మ్యాచ్‌లు	12 విజయాలు	4 ఓటములు	[2022]
17 మ్యాచ్‌లు	11 విజయాలు	6 ఓటములు	[2023]
03 మ్యాచ్‌లు	02 విజయాలు	1 ఓటమి	[2024]

లాభాలతో ఆరంభం

10.58 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, ఏప్రిల్ 1: నూతన ఆర్థిక సంవత్సరం తొలిరోజు లాభాలతో ప్రారంభించాయి దేశీయ స్టాక్ మార్కెట్లు. ఇంట్రాడేలో రికార్డు స్థాయిని తాకిన సూచీలు చివరి వరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం కూడా కలిసొచ్చింది. వరుసగా మూడోరోజు సోమవారం 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 603 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 74,254.62కి చేరుకున్నది. చివర్లో మార్కెట్ ముగిసే సమయానికి 363.20 పాయింట్లు ఎగబాకి 74,014.55 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 135.10 పాయింట్లు అందుకొని 22,462 వద్ద నిలిచింది. దీంతో మదుపరులు లాభాల జడివానలో తడిసిముద్దయ్యారు. గత మూడు సెషన్లలో స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడటంతో మదుపరుల సంపద రూ.10.58 లక్షల కోట్ల మేర పెరిగింది. రూ.3,93,15,471.18 కోట్లకు (4.74 ట్రిలియన్ డాలర్లు) చేరుకున్నది.

జీఎస్టీ వసూళ్లు 1.78 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: జీఎస్టీ వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. గత నెలకుగాను రూ.1.78 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో పోలిస్తే ఇది 11.5 శాతం అధికం. అలాగే జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రెండో అతిపెద్ద వసూళ్లు కూడా ఇదే కావడం విశేషం. ఏప్రిల్ 2023లో రూ.1.87 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఈ పన్ను అమల్లోకి వచ్చిన తర్వాతే ఇదే గరిష్ఠ స్థాయి. ఈ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.34,532 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,746 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.87,947 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.20.14 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. అంతక్రితం ఏడాదికంటే 11.7 శాతం అధికం. ఒక్కో నెలలో 1.68 లక్షల కోట్లు వసూలయ్యాయి.

తెలంగాణలో 5,399 కోట్లు

గత నెలలో తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు 12 శాతం మేర పెరిగాయి. ఏడాది క్రితం మార్చి నెలలో రూ.4,804 కోట్లు వసూలవగా, ఈసారి ఇది రూ.5,399 కోట్లకు పెరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే ఏపీలో 16 శాతం ఎగబాకి రూ.3,532 కోట్ల నుంచి రూ.4,082 కోట్లకు చేరుకున్నాయని వెల్లడించింది.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం మిస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా భారీగా ఆదాయం అంచనావేసుకున్న కేంద్ర ప్రభుత్వానికి మళ్లీ నిరాశే ఎదురైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం పీఎస్‌యూల్లో వాటాల విక్రయంతో రూ.30 వేల కోట్ల నిధులు సమకూరవచ్చునని సార్వత్రిక బడ్జెట్‌లో అంచనా వేయగా.. దీనిని అందుకోలేకపోయింది. రూ.16,507 కోట్లు మాత్రమే సమీకరించింది. 10 సంస్థల్లో వాటాల విక్రయంతో ఈ నిధులు సమకూరాయి. వీటిలో కోల్ ఇండియాలో వాటా విక్రయిస్తే అత్యధికంగా రూ.4,186 కోట్లు వచ్చాయి. కాగా, 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో మోదీ సర్కారు డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని మించి నిధులను సేకరించింది.

రికార్డుల గని.. సింగరేణి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : సింగరేణి రికార్డుల మీద రికార్డులను సృష్టిస్తున్నది. పాత రికార్డులను తిరగరాస్తూ.. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలో నయా రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఒక్క సంవత్సరంలోనే 70.02 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసిన సంస్థ..69.80 మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేసింది. 2022-23లో 67.14 మిలియన్ టన్నులు, 2021-22లో 65.02 మిలియన్ టన్నులు, 2020-21లో 50.58 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. అలాగే రవాణలోనూ 2019-20లో 62.45 మిలియన్ టన్నులు కాగా, 2020-21లో 48.51 మిలియన్ టన్నులు, 2021-22లో 65.53 మిలియన్ టన్నులు, 2022-23లో 66.69 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసింది.

గోల్డ్ హై జంప్

నూతన గరిష్ఠానికి బంగారం రేటు

తులం రూ.68,420 • ఒక్కరోజే రూ.1,070 పెరిగిన ధర • ఫ్యూచర్ మార్కెట్‌లోనూ సరికొత్త రికార్డులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి వెళ్లాయి. ఢిల్లీలో సోమవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత కలిగిన గోల్డ్) 10 గ్రాములు మునుపెన్నడూ లేనివిధంగా రూ.68,420ని చేరింది. ఈ ఒక్కరోజే రూ.1,070 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ర్యాలీ ప్రభావం.. భారతీయ మార్కెట్లపైనా ఉన్నదని ట్రేడింగ్ నిపుణులు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక ఫ్యూచర్ మార్కెట్‌లోనూ పసిడికి డిమాండ్ పెద్ద ఎత్తునే కనిపించింది. జూన్ నెల కాంట్రాక్ట్‌కుగాను రూ.978 పెరుగుదలతో రూ.68,679 పలికింది. కాగా, పన్నులతో కలిపితే ఢిల్లీలో తులం రూ.71,000 దరిదాపుల్లోకి వెళ్లినట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్‌లో రూ.930 ఎగిసి రూ.69,380 వద్ద రేట్లున్నాయి. పెండ్లిళ్ల సీజన్ కూడా కావడంతో మార్కెట్‌లో బంగారానికి కొనుగోలుదారుల నుంచి డిమాండ్ ఉంటున్నదని వర్తకులు చెప్తున్నారు.

వెండి ధరల్లో..

పసిడితోపాటు వెండి ధరలూ పరుగులు పెడుతున్నాయి. కిలో వెండి ధర ఢిల్లీలో రూ.1,120 ఎగబాకి రూ.78,570గా నమోదైంది. హైదరాబాద్‌లో రూ.600 పుంజుకొని రూ.81,600 వద్ద స్థిరపడింది. గ్లోబల్ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్సు గోల్డ్ ధర 2,265.73 డాలర్లుగా ఉన్నది. వెండి రేటు 25.13 డాలర్లుగా ఉన్నది. మొత్తానికి దేశీయ మార్కెట్‌లో సాధారణ వినియోగదారులతోపాటు పారిశ్రామిక వర్గాలు, మదుపరుల ఆసక్తితో బంగారం, వెండి ధరలు పెరుగుతూపోతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రికార్డుల ర్యాలీనే..

మార్కెట్ తీరు ఇలాగే ఉంటే పసిడి, వెండి ధరల్లో ముమ్ముందు సరికొత్త రికార్డులు నమోదవడం ఖాయమన్న అభిప్రాయాలు ఇటు నిపుణుల నుంచి అటు మార్కెట్ వర్గాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. నిజానికి దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో పరుగులు పెడుతున్నా.. బంగారం రేట్లు మాత్రం రికార్డుల్ని సృష్టిస్తున్నాయంటే.. స్టాక్స్ పడిపోతే ధరలు మరింత పెరుగుతాయనే చెప్తున్నారు. ఇందుకు కారణం మదుపరులు తమ పెట్టుబడులకు రక్షణగా గోల్డ్‌ను ఎంచుకుంటారని అంటున్నారు. అందుకే పుత్తడి రేట్లు సమీప భవిష్యత్తులో పెరగడమే తప్ప పెద్దగా తగ్గబోవనీ వారు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది తులం బంగారం రూ.75,000లను దాటేస్తుందని ఎక్స్‌పర్ట్స్ అంచనా వేయడం ఈ ధోరణికి ఊతమిస్తున్నది.

వాణిజ్య

జియోకు కొత్తగా 42 లక్షల యూజర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: రిలయన్స్ జియో నెట్‌వర్క్‌లోకి మరో 41.78 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు చేరారు. దీంతో మొత్తం మొబైల్ యూజర్ల సంఖ్య 46.39 కోట్లకు చేరుకున్నారని ట్రాయ్ తాజాగా వెల్లడించింది. అలాగే భారతీ ఎయిర్‌టెల్‌ను 7.52 లక్షల మంది ఎంచుకోగా, వొడాఫోన్ ఐడియా నుంచి 15.2 లక్షల మంది వైదొలిగారు.

ఎన్‌సీసీకి భారీ ఆర్డర్

హైదరాబాద్, ఏప్రిల్ 1: ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ రూ.3,086 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకున్నది. మార్చి నెలకుగాను వచ్చిన ఆర్డర్లలో రూ.1,589 కోట్ల ఆర్డర్లు ఎలక్ట్రికల్ డివిజన్ నుంచి రాగా, మరో రూ.1,330 కోట్ల విలువైన ఆర్డర్లు రవాణా డివిజన్, రూ.167 కోట్ల ఆర్డర్ బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని పేర్కొంది. మరోవైపు, 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి సంస్థ రూ.26 వేల కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకున్నది.

ఏ మార్పుల్లేవ్

ఆదాయ పన్ను విధానంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కొత్త ఆదాయ పన్ను (ఐటీ) విధానంలో ఎలాంటి మార్పుల్లేవని సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఏప్రిల్ 1 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం (2024-25) మొదలైన విషయం తెలిసిందే. దీంతో ఐటీ విధానంలో అమల్లోకి రానున్న మార్పులు అంటూ సోషల్ మీడియా, ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆర్థిక శాఖ స్పందించింది. నిజానికి గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఆరంభం నుంచే కొత్త ఆదాయ పన్ను విధానంలో చేసిన సవరణలు అమల్లోకి వచ్చాయి. అయితే దీని మదింపు సంవత్సరాన్ని 2024-25గా పరిగణిస్తారు. దీంతో దాన్నే ఆర్థిక సంవత్సరంగా పొరబడి సోషల్ మీడియా, ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో వార్తలు వండేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను మ